# బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

- మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు
- పాలమూరు-రంగారెడ్డి పథకంతో సాగునీటికి కృషి
- 2018కి ముందు కొడంగల్ ఎడారి
- నేడు కోట్లాది నిధులతో నియోజకవర్గ అభివృద్ధి
- కాంగ్రెస్ గెలిచేది లేదు.. 6 హామీలు ఇచ్చేది లేదు
- ఉనికిని చాటుకునేందుకే కాంగ్రెస్, బీజేపీల ఆరాటం
- భారీ మెజార్టీతో నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయం
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- ముఖ్య కార్యకర్తలు, విలేకరుల సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 18 : గత ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం ఎడారిని తలపించేలా ఉండేదని, సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాతే కొడంగల్ అభివృద్ధికి ప్రత్యేకంగా కోట్లాది నిధులను మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పడినట్లు మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రతి గ్రామాన్ని, తండాను సందర్శించి పరిశీలించినట్లు.. ఆనాడు గ్రామాలు, తండాల్లో తిరుగలేని పరిస్థితి ఉండేదన్నారు. నేడు ప్రతి గ్రామం, తండా బీటీ, సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయన్నారు. 2018కి ముందు నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోక ఎడారిని తలపించిందన్నారు. పట్నం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ అభ్యున్నతికి కృషి చేయడం వల్ల నేడు అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీది నీతిమాలిన రాజకీయమని, టికెట్ల కోసం రోడ్డెక్కుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక రాష్ట్రంలో ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నిలదీశారు. అక్కడే ఇవ్వనివారు ఇక్కడ ఇస్తామంటే ఏ విధంగా ప్రజలు నమ్ముతారన్నారు. ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉనికిని కాపాడుకునేందుకు మాత్రమే కాంగ్రెస్, బీజేపీలు తాపత్రయపడుతున్నాయని, ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని మంత్రి పేర్కొన్నారు.



తాండూరు : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి



కొడంగల్ : సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు

### హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ఖాయం

అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ ప్రజలకు పూర్తి నమ్మకం ఏర్పడిందని.. ఈ ఎన్నికల్లో పట్నం నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ముందుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈసారి ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనేనని.. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ఖాయమని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న ఏ ఒక్క పథకం కూడా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. అన్ని కాలాల్లో నీటి ఇబ్బందులు లేకుండా ఉండేలా మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి పథకంతో జిల్లాలో 4 నుంచి 5 లక్షల ఎకరాలకు నీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి లక్షా49వేల ఎకరాలకు సాగునీరందనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని సీఎం కేసీఆర్ పూర్తి చేయడంతోపాటు చెప్పని ఎన్నో కార్యక్రమాలను అమలు చేసి అభ్యున్నతిలో తెలంగాణను దేశానికి తలమానికంగా నిలబెట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిచేది లేదని, ఇచ్చిన 6 గ్యారెంటీ హామీలను పూర్తి చేసేదీ లేదన్నారు.

### ఇంటింటికీ సంక్షేమ పథకాలు

కొడంగల్ నియోజకవర్గంలో రైతు బంధు కింద రూ.91229 మందికి రూ.1,046 కోట్లు, రైతు బీమా ద్వారా 1647 మందికి రూ.82.35 కోట్లు, కల్యాణ లక్ష్మి ద్వారా 8860 మందికి రూ.58 కోట్లు, షాదీముబారక్ ద్వారా 1000 మందికి రూ.6.16కోట్లు, ఆసరా పింఛన్ ద్వారా 37,236 మందికి రూ.12కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో గతంలో ఏనాడూ నిధులు మంజూరైన దాఖలాలు లేవని పేర్కొన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించేలా చేపపిల్లల పంపిణీ, ఆర్థిక ప్రోత్సాహం, దళితుల అభ్యున్నతికి రూ.10లక్షలతో దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధుతో రూ.లక్ష సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు, డబుల్ బెడ్‌రూంలు అందించినట్లు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేద్దామని తెలిపారు. అభివృద్ధికి పాటుపడుతున్న ఇటువంటి పార్టీని ఆదరిద్దాం.. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపిద్దామని కార్యకర్తలకు సూచించారు.

### వేల కోట్ల నిధులతో నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేల కోట్ల నిధుల మంజూరుతో కొడంగల్ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కోస్గిలో 30వేల ఎకరాలకు సాగునీరందనున్నట్లు తెలిపారు. రూ.80కోట్లతో కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. బొంరాస్‌పేటలో దుద్యాల, కోస్గి మండలంలో గుండుమాల్, కొత్తపల్లి నూతన మండలాలు ఏర్పాటైనట్లు తెలిపారు. ముదిరాజ్, యాదవ, అంబేద్కర్ భవనాలకు రూ.5.50 కోట్లు, బీసీ, ఎస్సీ మైనార్టీ గురుకులాలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు రూ.25 కోట్లు, పీఆర్ రోడ్లకు రూ.217 కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.188 కోట్లు, తండాలకు బీటీ రోడ్లకు ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా రూ.62 కోట్లు, చెక్‌డ్యాంలకు రూ.51 కోట్లు, ఆలయాలకు రూ.5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

## తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు

తాండూరు : ఎవరెన్ని కుట్రలు చేసినా... ప్రతిపక్షాలు తలకిందులుగా తపస్సు చేసినా రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ దక్షిణ భారతదేశంలో చరిత్రను సృష్టించబోతున్నారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. తాండూరులో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వడ్ల కల్లాలప్పుడు అడుక్కుతినే వాళ్లలా.. ఎన్నికలు రాగానే కొందరు బయలుదేరారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీతో పాటు మాపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు నోటికి వచ్చినట్లు మాట్లాడితే తాటతీస్తామన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో, మహేందర్‌రెడ్డి తాండూరులో ఉన్నన్ని రోజులు తట్టుకునే శక్తి ఎవరికీ లేదన్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సీఎం కేసీఆర్ వదిలిన బుల్లెట్లు.. వాళ్లను తట్టుకొని నిలబడే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదన్నారు. ఎన్నికల్లో 100 సీట్లు సాధించి ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా మారిందన్నారు. జిల్లాలోని 4 అసెంబ్లీల్లో బీఆర్ఎస్‌ను గెలిపించే బాధ్యత తమదేనన్నారు. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. తాండూరు పట్టణ అభివృద్ధి పనులకు రూ.1191.86 కోట్లు, తాండూరు మండలంలో అభివృద్ధి పనులకు రూ.236.14 కోట్లు, యాలాల మండలంలో అభివృద్ధి పనులకు 97.77 కోట్లు, బషీరాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు 68.18 కోట్లు, పెద్దేముల్ మండలం అభివృద్ధి పనులకు రూ.78.54 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని బీఆర్ఎస్ అభ్యర్థులు తాండూరులో రోహిత్‌రెడ్డి, పరిగిలో మహేశ్‌రెడ్డి, కొడంగల్‌లో నరేందర్‌రెడ్డి, వికారాబాద్‌లో ఆనంద్‌ను మళ్లీ గెలిపించండి. ప్రతిపక్ష నేతల అసత్య మాటలను ప్రజలు నమ్మరాదని సూచించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు.

---

## జీవరాశులను కాపాడుకోవాలి

- డెక్కన్ బోర్డర్స్ మాజీ గౌరవ కార్యదర్శి శపతుల్లా
- అన్నాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో నేచర్ క్యాంప్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమం

కడ్తాల్, అక్టోబర్ 18 : పుడమిపై ఉన్న జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని డెక్కన్ బోర్డర్స్ మాజీ గౌరవ కార్యదర్శి శపతుల్లా అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో, లీఫ్ ఎడ్యుకేషన్ సెంటర్స్ విద్యార్థులతో నేచర్ క్యాంప్ ఫర్ చిల్డ్రన్ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శపతుల్లా మాట్లాడుతూ.. ప్రపంచంలో 11,600 రకాల పక్షిజాతులు, సముద్ర గర్భంలో కొన్ని కోట్ల జీవరాశులు జీవిస్తున్నాయని తెలిపారు. దేశానికి వివిధ దేశాల నుంచి ఏటా 460 రకాల పక్షులు వలస వస్తాయని తెలిపారు. దేశంలో 1,360 రకాల పక్షి జాతులు ఉండగా, ఒక్క తెలంగాణలోనే 367 రకాల పక్షి జాతులు ఉన్నాయని పేర్కొన్నారు. పక్షులను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఎంతో ఉన్నదని తెలిపారు. పక్షులు మావవాళికి ఎన్నో విధాల మేలు చేస్తున్నాయన్నారు.

రైతులు పండించే పంటలను నాశనం చేసే క్రిములను పక్షులు తినడం ద్వారా పంట దిగుబడి పెరిగి అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మన పరిసరాలల్లో ఉండే పక్షులకు హాని తలపెట్టవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎర్త్ సెంటర్ పరిసరాల్లోని పలు రకాల జీవజాతులను విద్యార్థులతో కలిసి పరిశీలించారు. తర్వాత విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, నందకుమార్, అజిత్, జయంతిమిత్ర, ఎర్త్ సెంటర్ డైరెక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, లీఫ్ సెంటర్ నిర్వాహకులు రజనీకాంత్, వెంకటేశ్, కోటేశ్ పాల్గొన్నారు.



జీవరాశుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శపతుల్లా

---

## చెక్‌పోస్టుల్లో పకడ్బందీ నిఘా

- సీసీ కెమెరాల నీడలో పర్యవేక్షణ
- జిల్లా పరిధిలో 15 బార్డర్ చెక్‌పోస్టులు
- ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలి
- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులకు సూచనలు, సలహాలను అందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్, అక్టోబర్ 18 : తెలంగాణ-కర్నాటక బార్డర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన నిఘా చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ముందుగా కలెక్టర్‌తోపాటు ఎస్పీ కోటిరెడ్డి కలిసి చెక్‌పోస్టులను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని హైవే 163 రహదారిపై రాష్ట్ర సరిహద్దు చంద్రకల్ చెక్‌పోస్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, డ్రగ్స్, డబ్బుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెక్‌పోస్టులో అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. పటిష్టమైన నిఘా కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. సిబ్బందితో నేరుగా మాట్లాడి చేపడుతున్న విధులను తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.8లక్షల 26వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

### నియమ నిబంధనలు పాటించాలి

రాజకీయ నాయకులతో పాటు ప్రజలు, అధికారులు ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన పెంచుకొని, కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. రూ.50వేల లోపే వెంట తీసుకెళ్లే ఆస్కారముంటుందని, ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లాల్సి వస్తే నగదుకు సంబంధించి పూర్తి వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సరైన వివరాలు లేకపోతే నగదు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల అనంతరం పూర్తి వివరాలను చూపించి నగదును తీసుకోవాలని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని 275 పోలింగ్ కేంద్రాల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా పకడ్బందీ చర్యలు తీసుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 2లక్షల30వేల మంది ఓటర్లు ఉన్నారని, 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడానికి ఈ నెల చివరి వరకు అవకాశం ఉన్నట్లు ఆయన చెప్పారు. యువత పూర్తి అవగాహనతో ఓటరు నమోదు చేసుకొని ఓటు హక్కును పొందాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై చాలా సీరియస్‌గా ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

### పూర్తి భద్రతా చర్యలు

ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో 15 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పూర్తి భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎటుంటి భయభ్రాంతులకు లోనుకాకుండా ఉండేలా అవగాహన కల్పించామన్నారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు రూ.75లక్షల వరకు నగదును, 1300 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. బైండోవర్, వెపన్స్ డిపాజిట్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో పాండుతోపాటు ఎస్‌ఐలు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.